'అమ్మతో కలిసి ఒక మొక్కను నాటాలి'

మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, జూలై 2 : దేశ ప్రధాని మోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ మాకా నామ్ అమ్మ పేరిట ఒక మొక్క నాటే కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మంగళవారం మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ గత నెల 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా ప్రతి బీజేపీ కార్యకర్త అమ్మతో కలిసి ఒక మొక్కను నాటి దానిని సోషల్ మీడియాలో పోస్టు చేయాలని అన్నారు. ఆ మొక్క పెరిగి పెద్దగా అయ్యే వరకూ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ఈ నెల 6వ తేదీ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి రోజున నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ విఠల్

నస్రుల్లాబాద్, జూలై 2 : నస్రుల్లాబాద్‌లోని మండల సమీకృత భవన సముదాయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ విఠల్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు వ్యవసాయం, విద్యుత్, ఉపాధి హామీ, వైద్య ఆరోగ్య తదితర శాఖలపై ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ పాల్త్య విఠల్, ఎంపీటీసీలను అధికారులు, నాయకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో నీలావతి, ఎంపీవో రాము, వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీటీలకు సన్మానం

మాచారెడ్డి, జూలై 2 : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు, ఎంపీటీసీలను ఎంపీడీవో గోపీబాబు మంగళవారం సన్మానించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రమోద్, సిబ్బంది ఉన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

భిక్కనూరు, జూలై 2 : అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగిన మంద రమేశ్(29) మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన మంద రమేశ్ ఇంటి నిర్మాణానికి కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ బ్యాంకు, గ్రామంలో అప్పు తీసుకున్నాడు. అప్పును ఎలా తీర్చాలో అర్థంకాక తీవ్ర మనోవేదనకు గురై గత నెల 27వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రామాయంపేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భిక్కనూరు మండల బీఆర్ఎస్ నాయకులు, ఎంపీటీసీలు ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో వైస్ ఎంపీపీ యాదగిరి, ఎంపీటీసీలు సాయిరెడ్డి, సాయాగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు. – భిక్కనూరు, జూలై 2

రైతులకు ఎరువులు, విత్తనాల
కొరత లేకుండా చూడాలి

భిక్కనూరు, జూలై 2 : రైతులకు విత్తనలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అధికారులను ఆదేశించారు. భిక్కనూరులో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు ఏ విధంగా వసూలు చేస్తున్నారని మండల విద్యాశాఖాధికారి ఎల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. ఫీజులకు సంబంధించి నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలని, స్కూళ్లను సందర్శించాలని ఆదేశించారు. ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులను షబ్బీర్‌అలీ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ శివప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల సభకు ప్రభుత్వ సలహాదారుని ఆహ్వానించడంలో తప్పులేదు

దోమకొండ, జూలై 2 : మండల సభకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని ఆహ్వానించడంతో తప్పులేదని జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ అన్నారు. దోమకొండలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల ప్రజా పరిషత్ సభలకు విశిష్ట అతిథుల గౌరవంగా చట్ట ప్రకారం ఆహ్వానించే నిబంధన ఉందని అన్నారు. అపార అనుభవం ఉన్న షబ్బీర్‌అలీ సభలకు హాజరైతే సమస్యల పరిష్కారం, ముఖ్యమంత్రి దృష్టికి ఆయా సమస్యలను తీసుకెళ్లే వీలుంటుందని అన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కామారెడ్డి, జూలై 2 : జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం సరైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు అన్ని రకాల కూరగాయలు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, అన్వర్ అహ్మద్, మీర్జా ఆఫీస్, అంజల్‌రెడ్డి, ప్రసన్న, చాట్ల వంశీ, నాయకులు తేజ ప్రసాద్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

బాన్సువాడ రూరల్, జూలై 2 : బాన్సువాడ మండలం బోర్లం క్యాంపులోని దుర్గమ్మ, అంబబాయమ్మ ఆలయాల్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీలను పగులగొట్టి నగదు, దుర్గామాత విగ్రహానికి ఉన్న బంగారు, వెండి నగలను ఎత్తుకెళ్లారు. ఈ విషయమై ఆలయ నిర్వాహకుడు మల్లేశ్ పోలీసుల కు సమాచారం అందించగా, మంగళవారం సీఐ కృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయ నిర్వాహకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్యే పోచారాన్ని కలిసిన క్వాలిటీ కంట్రోల్ డీఈ

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈ పద్మ

బాన్సువాడ టౌన్, జూలై 2 : బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని క్వాలిటీ కంట్రోల్ డీఈ పద్మ మంగళవారం ఆయన స్వగృహంలో మర్యాద పూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించి ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిం చాలని సూచించారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి రూరల్, జూలై 2 : జిల్లాలో అధిక ఫీజులు వసూ లు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజుకు విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవాడానికి మైదానాలు లేవని, ఐఐటీ, ఒలింపియాడ్ తదితర పేర్లతో ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే ప్రైవేట్ పాఠశాలలపై విచారణ చేపట్టి చర్య లు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్, బీడీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి భరత్, బీవీఎం జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు మణికంఠ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల కోసం విద్యార్థుల నిరీక్షణ

బోర్లంలో బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

బాన్సువాడ రూరల్, జూలై 2 : బాన్సువాడ మండలంలోని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సకాలంలో ఆర్టీసీ బస్సులు రాక తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. బస్సులు సమయానికి రాకపోవడంతో పాఠశాలకు ఆలస్యంగా వెళ్తున్నారు. బాన్సువాడ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆదర్శ పాఠశాలు, బాన్సువాడ పట్టణానికి చదువుకునేందుకు విద్యార్థులు వెళ్తున్నారు. తగినన్ని బస్సులు లేక పోవడంతో వచ్చిన బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసి పోతుండడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉచిత బస్సు సౌకర్యం పెట్టి తక్కువ బస్సులు నడుపుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు.

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

లింగంపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

నాగిరెడ్డిపేట/లింగంపేట/బీబీపేట్/మాచారెడ్డి/కామారెడ్డి, జూలై 2: నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నాగిరెడ్డిపేటలో తహసీల్దార్ లక్ష్మణ్‌కు, లింగంపేటలో తహసీల్దార్ నరేందర్‌కు, మాచారెడ్డిలో డిప్యూటీ తహసీల్దార్ భిక్షపతికు, బీబీపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలండర్‌ను విడుదల చేయాలన్నారు. నిరుద్యోగులకు నష్టం కలిగేలా ఉన్న జీవో46ను రద్దు చేయాలని కోరారు. 25,000 పోస్టులతో వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పితే ఐక్య పోరాటం చేస్తామని నిరుద్యోగులు హెచ్చరించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజాగౌడ్, కార్యదర్శి రాజు, బీజేపీ నాయకులు హన్మాం డ్లు, వెంకన్న, దేవీసింగ్, నిరుద్యోగులు పాల్గొన్నారు. లిం గంపేటలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, మండల శాఖ అధ్యక్షుడు రజనీకాంత్, కార్యదర్శి రవి, పట్టణ అధ్యక్షుడు సురేశ్ నాయకులు వంశీకృష్ణ, సుభాష్, రాజు, ప్రవీణ్, శ్రీకాంత్, రంజిత్, రాకేశ్, శివ, నరేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డిలోని జూనియర్ కళాశాల ఎదుట ఏబీవీపీ నాయకులు కండ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అన్నారు. మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి 11 వేల ఉద్యోగాలు వేయడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రత్యూష, అల్తాఫ్ రాజు, బలరాం, మానస, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలో 20వేల మొక్కలు నాటడమే లక్ష్యం

నాగిరెడ్డిపేట ఎఫ్ఆర్వో వాసుదేవ్

మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు, ఫారెస్ట్ అధికారులు

నాగిరెడ్డిపేట, జూలై 2: నాగిరెడ్డిపేట ఫారెస్టు రేంజ్ పరిధిలో ఈ సంవత్సరం హరిత వన మహోత్సవంలో భాగంగా 20 వేల మొక్కలను నాటడమే లక్ష్యమని ఎఫ్ఆర్వో వాసుదేవ్ అన్నారు. మండలంలోని బంజర వద్ద తాండూర్ శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో మంగళవారం హరిత వన మహోత్సవం ప్రారంభించారు. జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ వినీతతో కలిసి మొక్కలను నాటి నీళ్లు పట్టారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ.. ఈ సంవత్సరం అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీలో 50వేల మొక్కలను పెంచుతున్నట్లు చెప్పారు. తాండూర్ ఫారెస్టు శివారులో 2,700 మొక్కలు, ధర్మారెడ్డి అటవీప్రాంతంలో 5,500, రామాయపల్లి బీట్ పరిధిలో 11,110 మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. మిగిలిన 30వేల మొక్కలను కామారెడ్డి, ఎల్లారెడ్డి, పిట్లం ఫారెస్ట్ పరిధిలో మొక్కలు నాటేందుకు ఉపయోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి సంతోష్‌రెడ్డి, బీట్ ఆఫీసర్లు నవీన్, నాగరాజు, లవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీభూముల ఆక్రమణను అడ్డుకోవాలని వినతి..

మండలంలోని పల్లెబొగుడ తండా, టేకుల చెరువు తండాకు ఆనుకొని ఉన్న అటవీభూములను పలువురు అక్రమంగా సాగు చేసుకుంటున్నారని బొల్లారం గ్రామానికి చెందిన ఇగురం యాదగిరిగౌడ్ ఎఫ్ఆర్వో ఓంకార్‌కు ఫిర్యాదు చేశాడు. రెండు తండాల పరిధిలో వందల ఎకరాలు కబ్జాకు గురైందని తెలిపారు. విచారణ చేపట్టి, ఆక్రమణకు గురైన భూములను కాపాడాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రాజు
- లింగంపేట బాలుర ఉన్నత పాఠశాల తనిఖీ చేసిన అధికారి
- ఉపాధ్యాయులకు పలు సూచనలు

లింగంపేట బాలుర ఉన్నత పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డీఈవో రాజు

లింగంపేట, జూలై 2: ప్రభుత్వ పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి, లింగంపేట మండల ప్రత్యేక అధికారి రాజు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. లింగంపేటలోని బాలుర ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం పరిశీలించారు. వానకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఈగలు, దోమల ఉధృతి పెరుగుతుందని, దీంతో మలేరియా, డెంగీలాంటి విష జర్వాలు వచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు. పాఠశాల ఆవరణలోపి పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలో మౌలిక వసతులు పూర్తి చేసినట్లు ఉపాధ్యాయులు డీఈవోకు వివరించారు. అనంతరం ఆయన విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోటు బుక్కులు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు అందించినట్లు తెలిపారు. మండలంలోని ఆయా క్లస్టర్లలోని పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసిన పుస్తకాలు, కాపీలు, యూనిఫామ్‌లు, విద్యార్థుల వివరాలు సకాలంలో జిల్లా కార్యాలయానికి పంపాలని సీఆర్పీలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వహీద్ సిద్దిఖీ, సూర్య, రాజు, స్వప్న, సీఆర్పీలు విజయ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పుస్తకాల పంపిణీలో పాల్గొన్న ఎల్లారెడ్డి సీఐ

ఎల్లారెడ్డి రూరల్, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ అన్నారు. మండలంలోని వెల్లుట్లపేట గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఆయన 45 మంది విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సొంత డబ్బుతో విద్యార్థులకు బహుమతులను ఇవ్వడం తనకు అలవాటు అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్‌ను గ్రామస్తులు సన్మానించారు. కానిస్టేబుళ్లు ప్రేమ్‌సింగ్, అశోక్‌కుమార్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

నేరల్‌తండా శివారులో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గాంధారి, జూలై 2: మండలంలోని నేరల్‌తండా శివారులో రైతులు సాగు చేస్తున్న వానకాలం పంటలను కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రవి శంకర్, డాక్టర్ నీలారాణి మంగళవారం పరిశీలించారు. రైతులు సాగుచేస్తున్న మక్క, సోయా, పత్తి పంటలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. మక్కజొన్న పంటపై కాండం తొలచు పురుగుతోపాటు, కత్తెర పురుగు ఆశించినట్లు తెలిపారు. వీటి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనం శుద్ధి చేసుకోవాలని, దీంతోపాటు మక్కజొన్న పంటలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కాండం తొలచు పురుగు నివారణకు వేప నూనె ఐదు మిల్లీలీటర్లు లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేయాలని లేదా ఎమ్మామెక్టిన్ బెంజో యేట్ ఐదు శాతం మందును ఎకరానికి వంద గ్రాములు పిచికారీ చేసుకోవాలని సూచించారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి నరేశ్, ఏఈవో ఆరతి తదితరులు పాల్గొన్నారు.

నేడు గాంధారి తైబజార్ వేలం

గాంధారి, జూలై 2: ఇటీవల వాయిదా వేసిన గాంధారి వార సంత తైబజార్ వేలాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్ వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వారు లక్ష రూపాయలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం పది గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

లింగంపేటలో..

లింగంపేట, జూలై 2: లింగంపేట గ్రామ పంచాయతీలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. తైబజార్ వేలంలో పాల్గొనే వారు రూ.50వేలు, దడవాయి వేలంలో పాల్గొనే వారు రూ.25వేలు డిపాజిట్ చేయాలని సూచించారు. డిపాజిట్ చెల్లించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు.

టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, జూలై 2: విద్యుత్ బిల్లులను సులభంగా చెల్లించడానికి వినియోగదారులు టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక నుంచి ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ఇతర యుపీఐ యాప్‌లలో టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థ పేరు ఉండదని, వాటిద్వారా విద్యుత్ బిల్లు కట్టకాదని పేర్కొన్నారు. జీఎన్‌పీడీసీఎల్ యాప్ లేదా డిస్కామ్ వెబ్‌సైట్ https://tgnpdcl.com ద్వారా బిల్లు చెల్లించవచ్చని తెలిపారు. డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్, క్యాష్‌కార్డ్స్ ద్వారా కూడా విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట, జూలై 2: మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను డీఎల్వీవో సురేందర్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో చేపట్టిన విద్యుత్, మరుగుదొడ్లు, తరగతి గదులపై వేసిన డాంబర్ షీట్ పనులను పరిశీలింశారు. నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ యంత్రాలు, తాగునీటి కోసం ఏర్పాటు స్టీల్‌తో ఏర్పాటు చేసిన నల్లాలను తనిఖీ చేశారు. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆయనవెంట ఎంపీడీవో పర్బన్న, హెచ్ఎం వెంకటరాజు, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వైద్యాధికారికి సన్మానం

రామారెడ్డి, జూలై 2: రామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు ప్రభుత్వం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ అవార్డు ప్రకటించింది. దీంతో దవాఖానలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి దవాఖాన వైద్యాధికారికి శాలువా కప్పి సన్మానించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు దశరథ్‌రెడ్డి, రవీందర్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మాగౌడ్, మాజీ ఎంపీటీసీ నామాల యాదగిరి, పిట్టల గంగయ్య, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డి, జూలై 2: ఎల్లారెడ్డిలో మంగళవారం చిన్న పిల్లల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్నేహ వైద్యశాల సౌజన్యం తో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు రమేశ్ గౌడ్, సుబ్రహ్మణ్యం చిన్నారులను పరీక్షించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

దోమకొండ, జూలై 2 : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తిపై నుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన తులసిగారి బాలు బస్టాండ్ పక్కన మెయిన్ రోడ్డులో లాండ్రీ నడుపుతున్నాడు. అయితే ఆయన లాండ్రీ దుకాణం నుంచి తన ఇంటికి వెళ్తుండగా బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ బస్సు పైనుంచి వెళ్లడంతో బాలు మృతి చెందినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. ఈ విషయమై స్థానిక ఎస్సై గణేశ్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ప్లాస్టిక్ కవర్లను వాడొద్దు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 2: నిషేధిత ప్లాస్టిక్ కవర్లను అమ్మితే చర్యలు తప్పవని మున్సిపల్ సిబ్బంది దుకాణాదారులను హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు ఆదేశాల మేరకు పట్టణంలోని గాంధీచౌక్, డెయిలీ మార్కెట్‌లో మంగళవారం పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. నిషేధిత క్యారీ బ్యాగు విక్రయిస్తున్న, వాడుతున్న వారికి జరిమానా విధించారు. ఎవరైనా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తయారు చేయడానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు సూర్యవర్ధన్, కాశీరాం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

డోంగ్లీ, జూలై 2: మండలంలోని మోఘా గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు ఎస్‌డీఎఫ్ నుంచి రూ.ఐదు లక్షలను మంజూరు చేశారని చెప్పారు. దీంతో రోడ్డు పనులను ప్రారంభించామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శివాజీ పటేల్, పరమేశ్ పాటిల్, శివా పటేల్, రవికిరణ్ పాటిల్, నాగన్‌నాథ్ పాటిల్, సాయి పాటిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పది ఎకరాల వరకూ రైతుభరోసా ఇవ్వాలి



రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు

లింగంపేట, జూలై 2: పంటలు సాగుచేసే ప్రతి రైతుకూ రైతు భరోసా అందించాలని రైతులు అభిప్రాయాలను వెల్లడించారు. లింగంపేట మండలంలోని నల్లమడుగు, లింగంపేట, శెట్పల్లిసంగారెడ్డి గ్రామాల్లో మంగళవారం సమావేశాలు నిర్వహించి రైతుల అభిప్రాయలను సేకరించారు. ఎలారెడ్డి ఏడీఏ వీరస్వామి మాట్లాడుతూ.. పది ఎకరాల వరకు ఉన్న రైతులకు ఎకరాకు 15వేల రూపాయలు ఇవ్వాలని కోరారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని షరుతులు లేకుండా అమలు చేయాలన్నారు. సమావేశంలో లింగంపేట, నల్లమడుగు, శెట్పల్లిసంగారెడ్డి సహకార సంఘాల చైర్మన్లు దేవేందర్‌రెడ్డి, రమేశ్, సుకన్య, సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, సహకార సంఘం వైస్ చైర్మన్ మాకం రాములు, డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, సిద్ధిరాములు, అట్టెం శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సురేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, నయీం, సహకార సంఘాల సీఈవోలు సందీప్, మహిపాల్, శ్రీనివాస్ ఆయా గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.